## కథ

వల్లకాడంతా వల్లమాలిన కోలాహ[లం]గా వుంది!

అక్కడేదో గొప్ప బహిరంగ సభ జరగబోతోందనడానికి నిదర్శనంగా, అన్నింటిలోకి పెద్ద సమాధి పు[్రె]లతో[నూ], ఎముకలతోనూ అలంకరింపబడి వుంది!

మొహాలకి కాష్టంలో బూడిద పు[్ను]కున్న పిశాచాలు తమ ఇంట్లోనే ఏదో సంబరం జరుగుతున్నట్లుగా హడావి[డి]గా అటూ ఇటూ తిరుగుతున్నాయి.

ఆరోజు పిశాచాల నాయకుడు అక[్క]డి బహిరంగసభలో ప్రసంగించబోతున్నాడు!

# శ్మశానాల్లో తెలుగు సినిమా!



తమ ప్రియతమ నాయకుడికి హార్దిక స్వాగత[ం] చెప్పడానికి చుట్టుపక్కల పల్లెల నుంచి, అడవు[ల] నుంచి డజన్లకొద్దీ పిశాచాలు గుడ్లగూబలుగా, తీతు[వ]లుగా, గబ్బిలాలుగా మారి అరుచుకుంటూ అర్ధ[రా]త్రికి అరగంట ముందే భాగ్యనగరం శివార్లలో వున్న వల్లకాడుకి చేరుకున్నాయి.

''అబ్బ-ఈ హైదరాబాద్‌లో వాళ్ళకి ఎంత స్థల[ం] చాలడం లేదు! శ్మశానాల్లోనే ఫ్లాట్స్ కట్టేస్తున్నారు. ప[...]కాలంలో వల్లకాటికి ఆమడ దూరంలో వుండాలన హడలి చచ్చేవాళ్ళం! వీళ్ళకిదేం పోయేకాల[ం] వొదినా?'' అంటూ దవడలు నొక్కుకుంది షాద్‌నగ[ర్] పిశాచం!

''వల్లకాడు చుట్టూ ఇళ్ళూ, లైట్లు! కళ్ళు పొడు[చు]కున్నా ఏం కనిపించడం లేదు-ఈ కుర్రపిశాచా[లు] పోకిరి పనులు మాని, అలా ఎగిరి వెళ్ళి స్ట్రీట్ లైట్ల[ని] 'ఉఫ్' మని, ఆర్పేసి వస్తే బావుంటుంది కదు వదినా?'' అంటూనే కుర్రపిశాచాల్ని కేకేసింది ఘట[్‌కే]సర్ పిశాచం!

కుర్ర పిశాచాలు లైట్లార్పి వచ్చేలోపల వాళ్ళ నా[య]కుడు వచ్చేశాడు. పెద్ద తొక్కిసలాట!

నాయకుడు అలంకరించిన సమాధి మీద నిలబ[డి] ''మనుషుల్లా ప్రవర్తించడానికి సిగ్గులేదు మీకు? శాంతంగా కూర్చోండి'' అని అనేకసార్లు అరిచి చెప్పాక సర్దుమణిగింది.

పిశాచాలన్నీ మిగతా సమాధుల మీద, చెట్ల మీద సర్దుకున్నాయి.

''ఇటీవల మన లోకాలకి వచ్చిన కొత్త నేస్తాల స్వప రిచయంతో కార్యక్రమం ఆరంభిద్దాం!'' అన్నాడు నాయకుడు.

ఆయన ఆహ్వానాన్ని మన్నించి ముందుగా ఒక పిల్ల పిశాచం వేదిక దగ్గరకొచ్చింది.

''ఇంత చిన్న వయసులోనే మా లోకానికి ఎలా వచ్చావ్?'' అని ఆశ్చర్యంగా అడిగాడు నాయకుడు.

''నేను ఫోర్త్‌క్లాస్ స్టూడెంట్‌ని-ఒక రోజు స్కూల్‌కె ళుతూంటే, ఆటో తిరగబడింది! ''

'అంటే ఏక్సిడెంట్ కేస్ అన్నమాట!''

''కాదు-ఆటోలోంచి పక్కన గడ్డిలో పడిన నాకు దెబ్బలేమీ తగలలేదు! అయితే నా పుస్తకాల సంచీ నెత్తిన పడడంతో ఈ లోకానికి రాక తప్పలేదు! అయితే ఇక్కడంతా భలేగా వుంది! ఇక్కడ లాగర్‌ధమ్స్ లేవు-ఆల్‌జీబ్రా లేదు-షేక్స్‌పియర్ డ్రామా లేదు-ఫ్రెంచ్ విప్లవం పీడలేదు-భుజాన పాతిక కిలోల పుస్తకాల బరువు లేదు! లాలలూ..లాలలూ..'' అంటూ గంతులేసింది పిల్ల పిశాచం.

తరువాత ఒక యువపిశాచం వేదిక దగ్గరకొచ్చింది. అది శూన్యంలోకి చూస్తూ ఇంకా ఏదో పోగొట్టుకున్న దానిలా నిరాశా నిస్పృహలలో వుంది!

''జీవితంలో ఏదో పెద్ద దెబ్బతిని, నీరుగారిపోయినట్లున్నావే!'' అంటూ జాలిగా అడిగాడు నాయకుడు.

ఆ యువపిశాచం పెరిగిన గడ్డాన్ని తడుముకుంటూ, ''అవును-తట్టుకోలేని గట్టిదెబ్బ! నా అభిమాన హీరో సినిమా, వంద రోజులు ఆడి తీరుతుందని కోటి ఆశలు పెట్టుకున్నాను! అయితే ఆడిన ఐదురోజులూ హాల్లో నాతో పాటు ఈగలే వున్నాయి. వారం తిరగకుండానే డబ్బాలు తిరిగిపోయాయి. ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయాను! బ్రతుకే వృధా అనిపించి...''

''ఆ..అనిపించి గోదావరిలో దూకేశావా?'' అంటూ ఆ యువకుడు మాటలకి అడ్డుపడ్డాడు నాయకుడు.

''లేదు. గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. ఏమాత్రం లేట్ లేకుండా, ఠంచనుగా ఇక్కడికి వచ్చేశాను.''

**సాయంత్రం మా ఆవిడ పే[ర]ంటానికి వెళ్ళింది. ఏమీ తోచక అరింటికి టి.వి.ఆన్ చేసి, దూ[ర]దర్శన్ కార్యక్రమాలు చూడటం ఆరంభించాను. మీరు నమ్మం[డి], నమ్మకపోండి-ఏకబిగిన ఎనిమిదిన్నర దాకా ఆ ప్రోగ్రామ్స్ చూశాను. ఆ పై జరిగిందేమిటో ఊహించుకోండి! థర్డ్ ఫ్లోర్ [న]ుంచి టి.వి. క్రిందకు గిరవాటు పెట్టి, దానితోపాటు నేనూ దూ[క]ేశాను!**



ఆ యువపిశాచం జాలి గాథకి వెక్కి వెక్కి ఏడ్చాయి మిగతా పిశాచాలు.

ఈసారి చేతిలో పుస్తకంతో ఓ ఆడపిశాచం వేదిక దగ్గరకు వచ్చింది.

''చూడబోతే పట్టుమని పద్దెనిమిదేళ్ళు కూడా మానవలోకంలో వున్నట్లు లేదే!'' అన్నాడు నాయకుడు దానినే పరికించి చూస్తూ.

''ఉండలేకపోయాను! నా వల్ల కాలేదు! ఓ అభిమాన వారపత్రికలో 'అస్తిపంజరం కార్చిన కన్నీరు' సీరియల్ మంచి సస్పెన్స్‌లో ఆపేశారు! మళ్లీ వారం దాకా వేచి చూసే శక్తి ఈ దుర్బల హృదయానికి లేదు. అందుకే నిద్రమాత్రలు మింగేయాల్సి వచ్చింది'' అంటూ చేతిలో పుస్తకంలో పేజీలు తిరగేస్తూ వెళ్ళిపోయింది ఆడపిశాచం.

అది వెళ్ళగానే తలవొంచుకుని ఓ గృహిణి పిశాచం వేదిక దగ్గిరకు వచ్చింది. ''మా ఆయన ఆఫీసుకి వెళ్ళినప్పుడు పక్కింటి కామాక్షమ్మతో మార్నింగ్‌షో తెలుగు సినిమాకి వెళ్ళాను నేను!''

''ఆ సంగతి తెలిసి మీ ఆయన, అత్తగారు, ఆడపడుచులు కలిసి, బ్లాక్‌లో కిరోసిన్ కొని, నీ మీద దుమ్మరించేశారా?'' అంటూ ఆవేశపడిపోయాడు నాయకుడు.

''లేదు. నేను ఇంటికి వచ్చేసరికి మా అన్నయ్య ఊరు నుంచి వచ్చి వున్నాడు. ఏ సినిమాకి వెళ్ళావమ్మా అని అడిగాడు. అన్నయ్యకి ఆ తెలుగు సినిమా పేరు చెప్పలేక సిగ్గుతో ఉరేసుకున్నాను'' అంటూ ఆ సినిమా పేరు తలుచుకోడానికే సిగ్గుపడిపోయింది గృహిణి పిశాచం.

గృహిణి పిశాచం వెళ్ళగానే గృహస్థు పిశాచం వేదిక దగ్గిరకు వచ్చింది. ''పిల్లల పబ్లిక్ పరీక్షలు దగ్గరకొస్తున్నాయని మా ఆవిడ కేబుల్ కనెక్షన్ తీయించేసింది! 'చిరంజీవి' సినిమా రిలీజ్ అయిన రోజు స్కూళ్ళకి తప్పనిసరిగా సెలవు ఇవ్వాలని ఎలిమెంటరీ స్కూల్ పిల్లలు రాష్ట్రబంద్‌కి పిలుపిచ్చారు! రోజంతా ఆఫీస్ లేక ఇంట్లోనే వున్నాను. సాయంత్రం మా ఆవిడ పేరంటానికి వెళ్ళింది. ఏమీ తోచక ఆరింటికి టి.వి.ఆన్ చేసి, దూరదర్శన్ కార్యక్రమాలు చూడటం ఆరంభించాను. మీరు నమ్మండి, నమ్మకపోండి-ఏకబిగిన ఎనిమిదిన్నర దాకా ఆ ప్రోగ్రామ్స్ చూశాను. ఆ పై జరిగిందేమిటో ఊహించుకోండి! థర్డ్ ఫ్లోర్ మీంచి టి.వి. క్రిందకు గిరవాటు పెట్టి, దానితోపాటు నేనూ దూకేశాను!'' ఇంకా ఆనాటి తలనొప్పి తగ్గనట్లుగా కణతలు నొక్కుకుంటూ నిలబడిపోయింది గృహస్థు పిశాచం.

మాదిరాజు కామేశ్వరరావు

ఇలా ఇంకా చాలా చాలా పిశాచాలు తమ స్వపరిచయాలు చేసుకున్నాయి!

ఆ కార్యక్రమం తరువాత నాయకుడు వాటి సమస్యలను గురించి చెప్పమన్నాడు.

వల్లకాళ్ళను ఊళ్ళు మింగేస్తున్నాయని, శ్మశానాల్లో లైట్లు పెడుతున్నారని, పిశాచాలలో ఐక్యత లోపించిందని, మనుషుల్లో క్రూరత్వం పెరిగిపోతోందని నానా రకాల కష్టాలు చెప్పుకున్నాయి పిశాచాలు!

ఇంతలో ఒక యువ పిశాచం లేచి, ''ఈ కాలం పత్రికలన్నీ మన పేరు చెప్పుకుని సర్క్యులేషన్ పెంచుకుంటున్నాయి. మన మీద కథగానీ, సీరియల్‌గానీ లేని పత్రికలే వుండటం లేదు. 'ఫలానా రచయిత'

మన మీద కథలు వ్రాసి కార్లు కొన్నాడు!'' అంది కోపంగా.

ఆ మాటలకి నాయకుడు చల్లగా నవ్వి- ''విశేషప డకు. దీనివల్ల మనకి నష్టం ఏమిటి?'' అన్నాడు.

''నష్టమా నష్టంన్నరా? ఇప్పుడు జనం మనని చూస్తే భయపడేలా లేరు. సినిమాస్టార్స్‌కన్నా, క్రికెటర్స్ కన్నా మనమే పాప్యులర్ ఇప్పుడు! కనిపిస్తే 'ఆటోగ్రాఫ్ ప్లీజ్' అంటూ వెంటబడేలా వున్నారు!''

ఆ మాటలకి నాయకుడి పిల్లి కళ్ళు మిలమిల మెరిశాయి. నాయకుడన్న వాడికి కావలసింది పాపులారిటీ, ఆకర్షణ. తన పాపులారిటీ పెరగడానికి ఆ 'ఫలానా రచయిత' పనికొచ్చేలా వున్నాడు.

''వెంటనే వెళ్ళి ఆ 'ఫలానా రచయిత'ని ఇక్కడికి తీసుకురండి!'' అంటూ ఆజ్ఞాపించాడు నాయకుడు.

తక్షణం నాలుగు పిశాచాలు వెళ్ళి నిద్రపోతున్న ఆ రచయితను మంచంతో సహా ఈడ్చుకు వచ్చాయి.

కళ్ళు నులుముకుంటూ మంచం దిగిన ఫలానా రచయిత, అన్ని వందల పిశాచాలను చూడగానే, ''భలే మంచి రోజు-పసందైనరోజు'' అంటూ పరమానందంగా పాటందుకున్నాడు.

తనని చూసి కూడా అస్సలు దడుసుకోని ఆ రచయితను చూసి నాయకుడికి కోపం ముంచుకు వచ్చింది! వాడు చేయి పొడుగ్గా చాపి దూరంగా మండుతున్న చితిని ఆర్పేశాడు. తల గుండ్రంగా నాలుగుసార్లు తిప్పాడు. నాలుక వేదిక క్రింద దాకా చాపి రక్తం కక్కాడు.

''అద్భుతం! అమోఘం! చేతిలో కేమెరా వుంటే ఎంత బావుండేది! అఫ్‌కోర్స్ ఈ ట్రిక్కులన్నీ సినిమాల్లో చూపించేసినవే అనుకో!'' అన్నాడు రచయిత.

ఇక ఆ రచయిత తనను చూసి దడుచుకోవాలనుకోవడం అత్యాశగా భావించి ''మా మీద లేనిపోని కథలు వ్రాసి లక్షలు గడిస్తున్నావట! పేరు నీకు, డబ్బు నీకు! నలుగురిలో చులకనయ్యేది మేము. అంతేనా? ఒళ్ళెలా వుంది?'' అంటూ తీవ్రంగా ప్రశ్నించాడు నాయకుడు.

''ప్రస్తుతం ఇన్ని పిశాచాలను చూసి పులకరించిపోతోంది! కంప్యూటర్ గ్రాఫిక్స్ పుణ్యాన ప్రజలంతా స్క్రీన్ మీద పిశాచాలను అన్ని కోణాల్లో చూసేస్తున్నారు! తెలుగులో తీసే టెక్నిక్స్ తెలియక ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి డబ్ చేసి మరీ ఫారిన్ పిశాచాలను విరగబడి చూస్తున్నారు.! నిజమైన పిశాచాలను పెట్టి తెలుగులో ఓ సినిమా తీస్తే, నా సామిరంగా-కనకవర్షం కురుస్తుంది! అందరి ఇళ్ళల్లోనూ, టీషర్ట్స్ మీదా మీ బొమ్మలే వుంటాయి!'' అన్నాడు రచయిత అమితమైన ఉత్సాహంతో.

ఆ మాటలకి నాయకుడు ఉప్పొంగిపోయి, ''అయితే మాతో నిజంగానే సినిమా తీస్తావా?'' అని ఆత్రంగా అడిగాడు.

''మీరు ఓకే అంటే నేను రడీ! నా మేడ, పేర్లు, కార్లు అన్నీ అమ్మేసి బ్రహ్మాండమైన పబ్లిసిటీతో ఒకేసారి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సినిమా మొదలుపెడతాను. తెలుగు చిత్రసీమలో..కాదు..ప్రపంచ చలన చిత్ర సీమలోనే అపూర్వప్రయోగం! పిశాచాలు స్వయంగా నటించిన పిక్చర్! రిలీజ్ అయిన ప్రతి ఊళ్ళో పాత రికార్డులు బద్దలుకాక తప్పదు! మీ జనాకర్షణకి నాయకులంతా గజగజలాడాలి!'' రచయిత నిలబడి వున్న నాయకుడిచేత ఈస్ట్‌మన్ కలర్ కలలు కనిపించేస్తున్నాడు.

రాబోయే అమావాస్య, ఆదివారం, అర్ధరాత్రి పన్నెండింటికి పిక్చర్ మొదటి షాట్ తీయడానికి బ్రహ్మాండమైన ముహూర్తం అని అప్పటికప్పుడు లెఖ్ఖలు వేసి చెప్పాడు నాయకుడు! తరువాత రచయితని మంచంతో సహా సగౌరవంగా ఇంటికి పంపించాడు.

ఫలానా రచయితకి పిక్చర్ స్టార్ట్ చేయడానికి పట్టుమని పదిరోజుల టైం మాత్రం ఉంది! తనకున్నదంతా ఊడిస్తే ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఖర్చులకి కూడా చాలలేదు. అవును మరి, అన్ని దిన, వార, మాసపత్రికల్లో పేజీల కొద్ది కలర్ ప్రకటనలు! టి.వి.లో అన్ని ఛానళ్ళల్లోనూ పావుగంటకో యాడ్.

''పిశాచాలు స్వయంగా నటించే చిత్రరాజం''

''హీరోపాత్రకి ప్రాణం పోసే నాయక పిశాచం''


''మీ గుండెలు గుభేల్‌మనిపించే క్షుద్ర పిశాచాలు''

''దాదాపు యాభై పిశాచాలతో, 70ఎమ్ఎమ్ లో అన్ని భారతీయ భాషలతోపాటు ఇంగ్లీష్‌లో కూడా రాబోయే మొట్టమొదటి తెలుగు చిత్రం''

ఇలా తన దగ్గరున్న డబ్బంతా వెచ్చించి, కొన్ని పత్రికలకి, టీవీ ఛానళ్ళకి బాకీ పెట్టి మరీ ప్రకటనలు గుప్పించాడు!

అతని ఇంటిముందు డిస్ట్రిబ్యూటర్లు క్యూ కట్టారు. పిశాచాలున్న ఫస్ట్ స్టిల్ చూడగానే ఎడ్వాన్స్ చెల్లిస్తాం అన్నారు. ఆ సినిమా పాతిక కోట్ల బిజినెస్ చేస్తుందని ఊహాగానాలు చేశాయి పత్రికలు!

ముహూర్తం రోజు రానే వచ్చింది!




అమావాస్య, ఆదివారం, అర్ధరాత్రి పన్నెండు!

నాయకుడు అతిగా అలంకరణ చేసుకుని తన వయసు తక్కువగా కనబడాలని తాపత్రయపడుతున్నాడు!

మిగతా పిశాచాల హడావిడి చెప్పనక్ఖరలేదు!

కాలుతున్న శవం పక్కన నాయకుడు నిలబడి, ''మనుషుల మీద పగ సాధించి తీరుతా?'' అనే డైలాగ్ చెప్పడం మొదటి షాట్‌గా నిర్ణయించాడు రచయిత.

''నాకు మనుషుల మీద పగ ఏమిటి? దాన్ని ఎలా సాధిస్తాను?'' అంటూ అయోమయంగా అడిగాడు నాయకుడు.

''నాకు మాత్రం ఏం తెలుసు? ఇంకా కథ ఏమీ అనుకోలేదు! అయినా తెలుగు సినిమాలకి కథ అంటూ ఏమీ వుండదని పాతికేళ్ళ క్రితమే ఈ లోకానికి వచ్చిన నీకు తెలియదేమో! ప్రశ్నలడగకు-చెప్పింది చేయి!'' అన్నాడు రచయిత వ్యంగ్యంగా!

నాయకుడు తను చెప్పబోయే డైలాగ్‌ని నాలుగు సార్లు వల్లె వేసుకున్నాడు.

కేమెరాకి రడీ చెప్పి సరిగ్గాముహూర్తం టైంకి నాయకుడి మొహం మీద క్లాప్ కొట్టాడు ఫలానా రచయిత!

అంతే!

పిశాచాలన్నీ కెవ్వుమని అరచి మాయం అయిపోయాయి!

శ్మశానం అంతా నిశ్శబ్దం!

రచయిత ఎంత గట్టిగా అరిచి పిలిచినా పిశాచాల జాడలేదు!

అతని గుండెలు జారిపోయాయి!

లక్షల ఆస్తి ప్రకటనలకి హారతి కర్పూరం అయిపోయింది. ఇంకా లక్షల అప్పుంది!

యూనిట్ వాళ్ళకి దగ్గరున్న కొద్ది మొత్తం ఊడ్చి ఇచ్చేసి, తెల్లారేసరికి భాగ్యనగరం వదిలేశాడు రచయిత!

''పిశాచాలు నమ్మకద్రోహం ఎందుకు చేసినట్లు?'' అని ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా ఆ 'రచయిత' మెదడుకి తట్టనేలేదు. తను 'శ్రీ ఆంజనేయ పిక్చర్స్' అనే బోర్డ్‌మీద క్లాప్ కొట్టడంతో, ఆంజనేయుడి బొమ్మ చూసి, పిశాచాలు జడుసుకుని పారిపోయాయని!

ఇప్పుడా ఫలానా రచయిత తన స్వంత ఊళ్ళో కొబ్బరికాయల దుకాణం పెట్టుకుని, అప్పుడప్పుడు 'పిశాచం' అనే కలం పేరుతో మనుషులమీద వాళ్ళ సమస్యల మీద కథలు వ్రాస్తున్నాడు!

★★★

**ఈ కథ ఎవరినీ ఉద్దేశించి రాసినది కాదు. పూర్తిగా కల్పితం.**

**-రచయిత**